తెలుగు భాషా దినోత్సవ ప్రత్యేక సంచిక

సంపుటి : 10
సంచిక : 4,5
పుటలు : 52
రూ. 25 లు
ISSN NO
2582-8738
యు.జి.సి గుర్తింపు పొందినది

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

జులై, ఆగష్టు 2024



ప్రజాసామ్యంలో వాడుక భాషగా ప్రజల భాషే ఉండాలని పండితుల భాష కాదనీ పట్టుబట్టి సాధించిన ప్రతిభావంతుడు;

తన కాలానికంటే ఒక శతాబ్దం ముందు పుట్టిన ఆధునికుడూ మన దేశంలోనే ఆధునిక భాషా అధ్యయనాలకు ఆద్యుడూ;

తెలుగు దేశంలో తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతుల్లో ఆలోచించిన మొట్టమొదటి భాషా శాస్త్రవేత్త గిడుగు వెంకట రామమూర్తి

ప్రపంచంలోనే అతిపెద్ద నిడివి గల వీరగాథా చక్రాలు తెలుగు వారి సొంతం. వాటిలో అంకమ్మకత ఒకటి. పద్దెనిమిది నాళ్ళు నడిచే ఈ వీరగాథ, నాలుగు తరాల చాళుక్య రాజుల కథ (45వ పుట)

నిర్బంధ ఆంగ్లమాధ్యమం ఇంకెంత కాలం

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం.

◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...

◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలూ, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం

తెలుగుజాతి పత్రిక


అమ్మనుడి

సంపాదకుడు:
డా.సామల రమేష్‌బాబు 9848016136

సహసంపాదకుడు:
ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు 9866128846

తోడ్పాటు: డా.వెన్నిసెట్టి సింగారావు, డా.సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్

జులై, ఆగష్టు 2024



రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం, సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట- ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1.వ్యాసాలు,కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుండి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి.వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో పంపాలి. అనుఫాంట్‌లో టైప్ చేసినట్లయితే పి.యండి, మరియు పిడిఎఫ్‌లలో కూడా పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి,స్కాన్ చేసి పంపాలి editorammanudi@gmail.com కు మాత్రమే పంపాలి. కొరియర్‌లో గాని, రిజిష్టర్ పోస్టులో గాని పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నెంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనలను తీసుకోలేము

4.హామీ పత్రం తప్పనిసరి: రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగా రచనతో జోడించాలి. హామీ పత్రం లేని రచనలను ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను,వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.

లోపలి పుటలలో......

ముఖచిత్రం	కంప్యూటర్	కార్టూన్లు
చిదంబరం రావు	యన్.రాజారావు	సరసి

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు.

రచనలను, వార్తలను, వాట్సాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫొటోలు, రచనలను కొందరు వాట్సాప్‌లో పంపుతున్నారు.వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్/ రిజిష్టర్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. - సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136*, *e-mail* : editorammanudi@gmail.com

'తానా' నివేదిక

డా. చంద్రయ్య శివన్న
9963709032

తెలుగు భాషాపరిరక్షణ, పరివ్యాప్తి

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రతి నెలా చివరి ఆదివారం 'నెలా నెలా తెలుగు వెలుగు' పేరుతో అంతర్జాల కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఆ క్రమంలో గిడుగు రామమూర్తి పంతులు పుట్టిననాటి (ఆగష్టు 29) సందర్భంగా 25 ఆగష్టు, 2024న "తెలుగు భాషాపరిరక్షణ,



పరివ్యాప్తికోసం ఏం చేద్దాం?" అనే పేరుతో అంతర్జాల సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘం అధ్యక్షులు ఆచార్య ఉమామహేశ్వరరావు, ప్రత్యేకఅతిథిగా ప్రాచీనతెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి తానా పూర్వ అధ్యక్షులు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డా. తోటకూర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తానా అధ్యక్షులు శృంగవరపు నిరంజన్, తానా ప్రపంచ సాహిత్య వేదిక సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో విశిష్ట అతిథులుగా డా. సామల రమేష్‌బాబు, నూర్ భాషా రహమతుల్లా, డా. గుంటుపల్లి శ్రీనివాస్, శ్రీ జాక్ చెరూర్, డా. కటికనేని విమల, డా. చంద్రయ్య శివన్న, ఏనా రెమిల్లార్డ్ మల్లవరపు, శ్రీ రహమానుద్దీన్ షేక్, శ్రీ హరీష్ విరియాల, శ్రీ సురేష్ కొలిచాల పాల్గొన్నారు. భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30కు ప్రారంభమై అర్ధరాత్రి 12:33 గంటలకు ముగిసింది.

'తానా' ప్రపంచ సాహిత్య వేదిక సమన్వయకర్త శ్రీ చిగురుమళ్ళ శ్రీనివాస్ ఈ సమావేశంలో మాట్లాడుతూ, తెలుగువారు సాధించిన, సంపాదించిన జ్ఞానం, విజ్ఞానం, అనుభవసారం అంతా తెలుగు భాషలో నిక్షిప్తమై ఉంది. ఈ సంపద భావితరాలకు మాతృభాషద్వారానే అందుతుంది కాబట్టి మాతృభాషలోనే చదువులు సాగాలని అన్నారు. యాభై ఏళ్లుగా తానా తెలుగు భాషాసంస్కృతుల అభివృద్ధికోసం చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ సమావేశ ముఖ్యఅతిథి ఆచార్య ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, తెలుగు భాషామాధ్యమం అమలు జరగకపోతే, భవిష్యత్తులో సంభవించబోయే విపరీత పరిణామాలపై ఆందోళన వ్యక్తంచేశారు. తెలుగురాష్ట్రాల స్థూల జాతీయ ఉత్పత్తిలో (జి.డి.పి) ఎనభైఏడు శాతం తెలుగుతోనే సంపద సృష్టి జరుగుతోందన్నారు. తెలుగు భాషావినియోగంతోనే ఆర్థిక ఆలంబన ఉందన్నారు. తెలుగులో మాట్లాడటం ఒక ప్రతిష్ఠగా భావించాలని కోరారు. తరిగిపోతున్న మాతృభాషా హక్కులను సాధించుకోవాలన్నారు. మాతృభాషా మాధ్యమం స్వేచ్ఛకు సంకేతం. దీనివల్ల అనేకరంగాల్లో ఉద్యోగ,ఉపాధి అవకాశాల్ని మెరుగుపర్చుకోవచ్చు. ఇంగ్లీషులో చదివినవారే నూతన ఆవిష్కరణలపై పేటెంట్లు పొందుతున్నారనేది అవాస్తవం. మాతృభాషామాధ్యమాలలో చదువుకొంటున్న కొరియా, జపాను, చైనా, ఇజ్రాయేలు దేశాలు తలసరి పేటెంట్ల సంపాదనలో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయనీ ఇంగ్లీషు ప్రధాన భాషగా ఉన్న అ.సం.రా., కెనడా, బ్రిటను, ఆస్ట్రేలియాలు వెనుకబడి ఉన్నాయనే సంగతి పాలకులూ తల్లిదండ్రులూ తెలుసుకోవాలనీ అన్నారు. మాతృభాషాబోధన లేకపోతే, తెలుగువారు కేవలం వినియోగదారులుగా, దిగుమతిదారులుగా మాత్రమే మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రత్యేక అతిథి, ఆచార్య మాడభూషి సంపత్కుమార్ మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యావ్యవస్థ ద్వారా మాతృభాషకు ముప్పు ఏర్పడిందన్నారు. ఉద్యమిస్తేనే మాతృభాష బతుకుతుందన్నారు. దీనికోసం ప్రజాచైతన్యం అవసరమని అభిప్రాయపడ్డారు. తెలుగు నేర్చుకుంటోన్న విదేశీయురాలు మల్లవరపు ఏనా రెమిల్లార్డ్ సమావేశంలో తెలుగులో ఆమె మాట్లాడిన తీరు ఎంతో సహజంగానూ ఆసక్తికరంగానూ ఉంది. తెలుగు నేర్చుకొనడంలో తన అనుభవాల్ని తెలుగులో మాట్లాడుతూ అందరితోనూ పంచుకున్నారు. తెలుగు నేర్చుకోవడానికి గల కారణాల్ని, ఏకరువుపెట్టారు. విదేశీయులు తెలుగు నేర్చుకోడానికి ఇంగ్లీషులో ఉన్నన్ని వనరులు తెలుగులో లేవన్నారు. ఈ సమావేశంలో డా. తోటకూర ప్రసాద్ ఈమెతో జరిపిన సంభాషణ ఎంతో ఆసక్తిగా సాగింది. 'మనసున మనసై బ్రదుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యమూ అదే స్వర్గము' పాటను ఎంతో బాగా ఆలపించారు. ప్రశాంతి చోప్రా దుబాయిలో స్థిరపడిన ప్రవాస తెలుగువారు. సురేశ్ కొలిచాల రాసిన 'ఘనమైన మన భాష మన తెలుగు భాష' పాటను ఈమె ఎంతో శ్రావ్యంగా, అద్భుతంగా పాడారు.

తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు డా. సామల

రమేష్‌బాబు మాట్లాడుతూ, పట్టణాలతోపాటు గ్రామాల్లో నివసిస్తోన్న ప్రజల్లోకి ఈ భాషోద్యమాన్ని తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల్లో ఉద్యమస్ఫూర్తి తీసుకురావడానికి గిడుగువారి కృషిని అధ్యయనం చేయాలన్నారు. గిడుగు సూచనల్ని పాటించాలన్నారు. గిడుగును పక్కనపెట్టి మనం ఏం చేయలేమని చెప్తూ, ప్రజల భాష, పండితుల భాషకంటే ఎంతో ఉన్నతమైందని గిడుగు చెప్పిన అభిప్రాయం, దృష్టి మనకు ఉండాలన్నారు. తెలుగు చదివినవారికి ఉద్యోగాల్లో ప్రోత్సాహకాలు ఉండాలని సూచించారు. పూర్వ డి.కలెక్టర్ డా. నూర్ భాషా రహమతుల్లా మాట్లాడుతూ, తెలుగు మాధ్యమాన్ని ప్రాథమికస్థాయి వరకు తప్పనిసరిగా బోధించాలన్నారు. తెలుగు చదివినవారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థ తీర్పులు తెలుగులో జరగాలన్నారు. సాంకేతికరంగం కేంద్రంగా తెలుగు అభివృద్ధి జరగాలంటే, తెలుగులో సాంకేతిక నిపుణులు తయారుకావాలని సూచించారు. పదిహేనేళ్ళ పోలెండ్ దేశస్థుడైన శ్రీ జాక్ చెర్నూర్, ఈ సమావేశ విశిష్ట అతిథి మాత్రమే కాదు ఒక విశిష్ట వ్యక్తి కూడా. ఈ అబ్బాయి దాదాపు 400 తెలుగు పాటల్ని అలవోకగా పాడటం ఈతని గొప్పతనం. జాక్ ఈ సమావేశంలో శంకరాభరణం సినిమాలోని 'బ్రోచేవారెవరురా', 'వేదం అణువణువున నాదం' 'తరలిరాద తానై వసంతం' మొదలైన పాటల్ని ఎంతో మధురంగా తెలుగుదనంతో పాడి వినిపించాడు. పాటలో మధ్య మధ్యలో వచ్చే సంగీత స్వరాలను ఎంతో లయాత్మకంగా, శాస్త్రీయంగా పాడి ఔరా! అనిపించాడు. శ్రీమతి బచ్చు బిందు, ఓ తెలుగు ప్రవాసిగా తెలుగు నేర్చుకున్న తీరును వివరించారు. నా చరిత్ర మూలాలను తెలుసుకోవాలనే కోరిక కలిగిందన్నారు. మా పిల్లలకోసం ఇంగ్లీషులోని పుస్తకాలను తెలుగులో అనువాదం చేసి మరీ వారికి తెలుగుపై అభిమానం కలిగేలా ఒక తెలుగు తల్లిగా తాను చేస్తోన్న కృషిని పంచుకున్నారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలుగు నేర్పించడంలో ఆసక్తి చూపాలని కోరారు. ప్రవాస తెలుగువారు ఆసక్తి కనబరిస్తేనే అమెరికా లాంటి చోట్ల తెలుగు పరిరక్షించబడుతుందని అన్నారు. తెలుగు మాట్లాడే ప్రవాసులను ప్రోత్సహించండి. వారిని అభిమానంతో చూడండి. వారిని స్వేచ్ఛగా మాట్లాడనివ్వండని తెలుగువారికి విజ్ఞప్తి చేశారు. గుంటుపల్లి శ్రీనివాస్ చేసిన పిపిటి ప్రసంగం ఎంతో ఆలోచనాత్మకంగా ఉంది. వ్యక్తులు, వ్యవస్థల ద్వారానే భాషాపరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఉర్దూ భాష భారతదేశంలో ఏ విధంగానైతే అడుగంటిపోతుందో తెలుగు కూడా అలా తరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తెలుగు భాషాపరిరక్షణకు ఎన్నో సూచనల్ని చేశారు. చాలా ప్రణాళికాబద్ధంగా జరిగిన ప్రసంగమిది. డా. కటికనేని విమల ఎంతోకాలంగా వివిధ దేశాల్లోని విద్యార్థులకు తెలుగు నేర్పించిన అనుభవాలను పంచుకొన్నారు. ఆమె మాట్లాడుతూ, ముందుగా భాషాతత్వాన్ని అర్థంచేసుకోవాలన్నారు. కేవలం తెలుగు మాట్లాడితే చాలు అనుకోకుండా రాయడం కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. విద్యార్థులకు తెలుగును వివిధ దశల్లో (గ్రేడేడ్ వైజ్ గా)నేర్పిస్తానని తన శిక్షణా పద్ధతిని చెప్పుకొచ్చారు. భాషాపరిరక్షణ, పరివ్యాప్తి గురించి మాట్లాడుతూ, తెలుగు భాషకు గిడుగు చేసిన కృషిని గుర్తుచేస్తూ, ఆయనలా చిన్నపిల్లలకోసం ప్రత్యేకంగా నిఘంటువులు నిర్మించాల్సి ఉందన్నారు. అదేవిధంగా వాడుక భాషావ్యాకరణం కావాలన్నారు. భాషాపరిరక్షణ అనే మాట విషయంలో తనకు గల అభ్యంతరాన్ని చెపుతూ, భాషాపరిపుష్టి కావాలన్నారు. తద్వారా పరివ్యాప్తి జరుగుతుందన్నారు. అవిచ్ఛిన్న విద్యాపద్ధతిని అమలుచేయాలన్నారు. స్పెల్ బి లాంటివి తెలుగులో అమలు చేయాలి. ఎన్.ఇ.పి. తో భారతీయ భాషలకి మంచిరోజులు ఉండబోతున్నాయనే విశ్వాసాన్ని ప్రకటించారు.

నిజాం కళాశాల తెలుగు అధ్యాపకుడు, అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్ లో విదేశీ విద్యార్థులకు తెలుగును బోధిస్తోన్న డా. చంద్రయ్య శివన్న మాట్లాడుతూ, భాషాపరిరక్షణ, పరివ్యాప్తి ఒక సంక్లిష్ట, సున్నిత సందర్భంలో ఉందన్నారు. తెలుగు బోధన అమలు, అభివృద్ధిని రాజ్యాంగ బాధ్యతగా కాకుండా ఉదారంగా చేసే పనిగా, పట్టించుకోనవసరంలేని విషయంగా రెండు తెలుగు ప్రభుత్వాలు భావిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే సామాజిక వర్గాలే ఎందుకు తెలుగు చదువుకోవాలి? ప్రభుత్వ పాఠశాలల్లోనే తెలుగు మాధ్యమాలు ఎందుకు కొనసాగించాలి? అంటూ లేవనెత్తుతున్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేని నిస్సహాయ స్థితిలో మనం ఉన్నామన్నారు. ఈ సున్నిత సందర్భంలో మన 'భాషోద్యమ కార్యాచరణ ఏ సామాజికవర్గాల అభివృద్ధికీ వ్యతిరేకం కాదు' అనే సంకేతాన్ని సమర్థవంతంగా ఇవ్వగలగాలన్నారు. సామాజిక సమానత్వ విలువగా భాషాపరివ్యాప్తి జరగాలన్నారు. తెలుగు భాషకు సంబంధించి కో-కరిక్యులమ్ ఆక్టివిటీస్ క్రమంతప్పకుండా నిర్వహిస్తూ, విద్యార్థులకు భాషపై పట్టును, వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంపొందించే విధంగా రూపకల్పన జరగాలన్నారు. తెలుగులో సమస్త సమాచారం అన్ని మాధ్యమాల్లో అంటే దృశ్య, శ్రవణ, పఠన మాధ్యమాల్లో అందుబాటులోకి తీసుకురావడానికి పనిచేస్తున్న వ్యక్తుల్ని, సంస్థల్ని అవసరమైనమేరకు ప్రోత్సహించాలని సూచించారు. భాషామార్కెటీకరణ జరగాల్సిన అవసరాన్ని చెబుతూ, ఇంటర్నెట్ బేస్ గా పనిచేసే కృత్రిమ మేధ లాంటి అనేక సాంకేతిక పరికరాల్లో వాడటానికి పనికొచ్చే విధంగా తెలుగు భాషానిర్మాణాలపై పరిశోధనలు విస్తృతంగా చేయాల్సి ఉందన్నారు. భాషోద్యమకారులు, సామాజిక, రాజకీయార్థిక ఉద్యమాలకు సంఘీభావంతో మెలగాల్సి ఉంటుంది. వెయ్యేళ్ల కాలంలో ఏ ఒక్క తెలుగు భాషోద్యమకారుడైనా భాషకోసమై జైలు జీవితం గడిపాడా? చరిత్రలో ఏ ప్రజాకాంక్ష అయినా త్యాగాలు చేయకుండా విజయం సాధించలేదు. అది ఆంధ్రరాష్ట్ర అవతరణైనా, తెలంగాణ రాష్ట్ర అవతరణైనా, నిన్నటి మాదిగ రిజర్వేషన్ పోరాటమైనా ఆఖరుకు మనం మాట్లాడుతున్న మాతృభాషాదినోత్సవమైనా. బంగ్లా యువకుల నెత్తుటి త్యాగాలమీద కదా మాతృభాషాదినోత్సవం జరుపుకుంటోంది అనే చారిత్రక నగ్నసత్యాల్ని ప్రతి భాషోద్యమకారుడు గమనంలో ఉంచుకోవాలంటూ త్యాగాలకు సిద్ధపడాల్సిన అవసరం ఉందన్నారు.

తెలుగు సాంకేతిక నిపుణులు శ్రీ రహ్మానుద్దీన్ షేక్ మాట్లాడుతూ, మారిన కాలానికి అనుగుణంగా భాషావిధానం ఉండాలని సూచించారు. సమాచారం అందరికీ అందుబాటులో ఉండడంలేదని వాపోయారు. అంతర్జాలంలో సరైన తెలుగు కంటెంటును తయారు

తరువాయి 48 పుటలో

విశ్లేషణా ప్రక్రియలు

35వ పుట తరువాయి

మాధ్యమ సమాచారాన్ని విశ్లేషించేందుకు ఉపయోగించవచ్చు. ఉదాహరణకు, బహురూప గాథ అధ్యయనం చిత్రాలను, వచనాన్ని మరియు శ్రవణాన్ని సంయుక్తంగా విశ్లేషించడం ద్వారా బహుళ మాధ్యమ సమాచారంపై అవగాహన మరింత పెంచవచ్చు.

భవిష్యత్తు : బహురూప గాథ అధ్యయన రంగం నిరంతరం అభివృద్ధి చెందుతోంది. పరిశోధకులు కొత్త నిర్మాణాలు, సమ్మేళన పద్ధతులు ఇంకా ఇతర అనువర్తనాలను అన్వేషిస్తున్నారు. ఈ రంగంలో మరింత శ్రద్ధ వహించాల్సిన ఉపరంగాలు:

- ఉత్పాదకకృత్రిమ బౌద్ధిక (Generative AI) ఏకీకరణ:
- బహురూప నమూనాలను మూల్యాంకనం చేయడానికి ప్రామాణిక కొలమానాల అభివృద్ధి:
- బహురూప వ్యవస్థల్లో పక్షపాతానికి సంబంధించిన నైతిక సవాళ్ళ

పరిష్కారం: సంక్లిష్ట సమాచారాన్ని అర్థం చేసుకోవడానికి కృత్రిమ మేధో వ్యవస్థల సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో బహురూప గాథ అధ్యయనానికి గొప్ప భవిష్యత్తు ఉంది. ఈ రంగంలో పరిశోధకులు, అభ్యాసకులు వివిధ సవాళ్ళను పరిష్కరించడం ద్వారా ఈ రంగంలోని సరిహద్దులనుదాటి మరింత విస్తృతపరచవచ్చు. కృత్రిమ మేధస్సు భవిష్యత్తును రూపొందించడంలో బహురూప విధానాలు కీలక పాత్ర పోషిస్తాయి. విభిన్న దత్తాంశ పద్ధతులపై గాథ అవగాహన ద్వారా బహురూప గాథ అధ్యయనం వివిధ రంగాలలో కొత్త అవకాశాలనూ అనువర్తనాలనూ కనుగొనడానికి సిద్ధంగా ఉంది.

రచయిత పరిశోధక విద్యార్థి, అనువర్తన భాషాశాస్త్ర
అనువాద అధ్యయనాల విభాగం,
హైదరాబాదు విశ్వవిద్యాలయం

గిడుగు "గద్య చింతామణి"

15 వ పుట తరువాయి

మొదలైన వారి రచనలల్లోని అపశబ్దాలు గుర్తించారు గిడుగు. అంతేకాదు, తెలియని పరిచయంలేని, ప్రాచీనాంధ్ర భాషలో రచనలు చేస్తే, ఎవరికైనా ఈ తప్పులు జరగుతాయని గిడుగు హెచ్చరించారు.

"నన్నయ గారి నుంచీ చిన్నయ సూరి దాకా, వెలసిన కవిపండితులు, గ్రాంథిక భాషలో నిర్మించిన తెలుగు వాఙ్మయంనుంచి తప్పులను తవ్వి, కుప్పలు కుప్పలుగా పోశారాయన. సమకాలికులైన విద్వత్కవుల రచనలనుంచి తప్పుల తిప్పలను బండ్ల కెత్తి తూర్పారబట్టారు. కొమ్ములు తిరిగిన ఉద్దండ పండితులే నిర్దుష్టంగా రాయలేని గ్రాంథిక భాషాశైలిలో బడి పిల్లలూ, సామాన్యులూ రాయాలని ఉద్దేశించడం అశాస్త్రీయమనీ, ఆదేశించడం అన్యాయమనీ అది ఏటికెదురీత వంటిదనీ గిడుగు వారు పత్రికా ముఖంగా ప్రబోధం కావించారు. తెలుగు మాగాణమంతా తిరిగి సభాముఖంగానూ, విజ్ఞప్తుల పరంగానూ ప్రచారంచేశారు." – ఆచార్య తూమాటి దొణప్ప.

రచయిత గౌరవాధ్యక్షులు, తెలుగు శాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

తెలుగు భాషాపరిరక్షణ, పరివ్యాప్తి

8వ పుట తరువాయి

చేసుకోవాలి. ప్రతిదీ ప్రభుత్వాలమీద ఆధారపడకుండా వైయక్తిక స్థాయిలో కూడా మనం అనేక పనులు చేయొచ్చని వాటికి గల అవకాశాల్ని గుర్తుచేశారు. మంచి తెలుగు కంటెంట్ ఎవరికివారు తయారు చేయాల్సి ఉంటుందన్నారు. తెలుగు భాషను నేర్చుకునేందుకు వీలుగా ఈ-బుక్స్, ఆప్స్, ఆన్లైన్ నిఘంటువులు రూపొందించుకోవాల్సి ఉంది.

మరో తెలుగు సాంకేతిక నిపుణులు శ్రీ సురేశ్ కొలిచాల మాట్లాడుతూ, తెలుగు భాషను పరిరక్షించుకోవడంలో సరైన ప్రణాళికను అనుసరించకపోతే 22వ, శతాబ్దంలో అంతరించబోయే 90% భాషల్లాగే తెలుగు భాషకూడా తన మనుగడను కోల్పోవచ్చని హెచ్చరించారు. ఇప్పటికే ప్రసార మాధ్యమాల్లోని, సామాజిక మాధ్యమాల్లోని తెలుగు భాష నిజమైన తెలుగేనా అనే సందేహం కల్గుతుందన్నారు. విపరీతమైన ఆంగ్ల భాషాపదాల మిశ్రమంతో ఉపయోగించబడుతున్న తెలుగు ఎలా ఉందో చూడండని సామాజిక మాధ్యమంనుంచి తీసుకొన్న ఒకరాతని ఉదాహరణగా తన కంప్యూటర్ తెర మీద చూపించారు. భాష మనుగడకు ఆయన ఆరు సూత్రాలను ప్రతిపాదించారు. భాషకు, ఆర్థిక స్వావలంబనకు తప్పనిసరిగా లంకె ఉండాలని నొక్కిచెప్పారు. తెలుగు ముద్రణారంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ఒక రచయిత కనీసం 500 పుస్తకాలను కూడా అమ్ముకోలేని దీనస్థితి మన తెలుగు ముద్రణారంగానిది అంటూ ఆవేదన చెందారు. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా వస్తోన్న జాతీయతా భావనవల్ల భారతదేశంలో హిందీ భాష తెలుగుమీద పెత్తనం చెలాయించే ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

భిన్నరంగాల్లో పనిచేస్తోన్నవారు పాల్గొన్న ఈ సమావేశం తెలుగు భాషాపరిరక్షణ, పరివ్యాప్తిపై విభిన్నమైన ఆలోచనలు చేసింది. సమావేశాన్ని ఆద్యంతం ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహించారు డా.తోటకూర ప్రసాద్. వక్తలు మాట్లాడిన అనేక విషయాల మధ్య ఎప్పటికప్పుడు ఒక తార్కిక లంకెను కూరుస్తూ సమావేశాన్ని సమన్వయపరిచారు. ఈ సమావేశంలో చాలా ఫలవంతమైన చర్చలు, అభిప్రాయాల ప్రకటన జరిగినందుకు సంతోషం. ఇలాంటివి మరెన్నో జరగాలని కోరుకుందాం.

> **చదువులోని ప్రాథమిక దశలోనే శాస్త్ర విజ్ఞానం లోని ప్రాథమిక భావన బీజాలుంటాయి. విద్యార్థికి పాఠశాల గది బయట మాతృభాషలో కలిగే శాస్త్ర విజ్ఞాన అనుభవాలకు, పాఠశాల గదిలో పరాయిభాషలో చెప్పే విజ్ఞాన భావనలకు పొంతన అందక, సమన్వయం కుదరక, అతని అవగాహన విస్తృతం కాదు. శాస్త్రం మీదే కాక చదువు మీద కూడా ఆసక్తి తగ్గుతుంది -- డి.యస్.కోఠారి**